జయహో 2019
II సాక్షి
నల్లగొండ I బుధవారం I మార్చి I 27 I 2019 I www.sakshi.com

## ‘జీరో బడ్జెట్’ కాన్సెప్ట్ ఎన్ని‘కల’ కాదు

- పారదర్శకతే ప్రజాస్వామ్య మంత్రం
- ఈ భావనే భవిష్యత్ రాజకీయాలకు పునాది
- జీరో బడ్జెట్ పాలిటిక్స్‌పై ‘సాక్షి’తో మాధవరెడ్డి



# మంచితనమే పెట్టుబడి

Interview

..:::: వాకా మంజులారెడ్డి

**రాజకీయ రంగం అంటే.. అనుక్షణం వ్యూహాత్మకంగా పావులు కదపాల్సిన రంగం. డబ్బును మించిన ప్రభావవంతమైన పావు మరొకటి లేదనే పరిస్థితి.. ‘ఎన్నికలు ఖరీదైపోయాయి. రాజకీయరంగం సంపన్నులకు తప్ప సామాన్యులకు అందని రంగంగా మారింద’ని అనుకోక తప్పడం లేదు. అలాంటి సమయంలో ఉద్భవించిన వినూత్న కాన్సెప్ట్ జీరో బడ్జెట్ పాలిటిక్స్. ఇందులో రాజకీయ వ్యూహాలుండవు. ఉన్నదంతా పారదర్శకతే. అందుకే భవిష్యత్తు జీరో బడ్జెట్ పాలిటిక్స్‌దే అయి తీరాలి. ఇందుకోసం కంకణం కట్టుకున్న ఓ సామాజికోద్యమకర్త ‘జీరో బడ్జెట్ మాధవరెడ్డి’.**

### దేశవిదేశాల్లో జీరో బడ్జెట్

‘జీరో బడ్జెట్ పాలిటిక్స్’ కాన్సెప్ట్‌ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి దేశమంతటా పర్యటిస్తున్నారు పోతిరెడ్డి మాధవరెడ్డి. బ్రిటన్, అమెరికాలో ప్రసంగించారు. న్యూఢిల్లీ, పంజాబ్, కర్ణాటక, రాజస్తాన్‌తోపాటు తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, అనంతపురం, తిరుపతి, నెల్లూరు, మంగళగిరి, గుంటూరు, విజయవాడ, ఖమ్మం, కాగజ్‌నగర్, పెద్దపల్లి నగరాల్లో సదస్సులు నిర్వహించారు. రాజస్తాన్‌లోని బిట్స్ పిలాని, ఎమ్ఐటీ పుణే, ఐఐటీ ముంబై వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో విద్యార్థులను చైతన్యవంతం చేశారు. సమాజహితమైన, ప్రజాస్వామ్యహితమైన ఈ ఆశయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంపై ఆయన ఆశయాలను ఆయన మాటల్లోనే తెలుసుకుందాం.

### నాయకులు సమాజాన్ని ప్రేమించాలి



రాజకీయ రంగంలో వస్తున్న మార్పులు.. ఎన్నికలు జరుగుతున్న తీరుతెన్నులను గమనించినప్పుడు ప్రజాస్వామ్యం ఎటుపోతోందనే ఆవేదన కలిగేది. ఏదో ఒకటి చేయాలనిపించేది. ఆ ఆవేదనలో నుంచి పుట్టిన పరిష్కార మార్గమే జీరో బడ్జెట్ పాలిటిక్స్. నిజానికి ఇందులో బడ్జెట్ లేదు, పాలిటిక్స్ లేవు. ఉన్నదంతా మానవత్వం, మంచితనమే. నాయకుడు తన కుటుంబాన్ని ప్రేమించినట్లే సమాజాన్ని కూడా ప్రేమించగలగాలి. ముసుగు వేసుకోకుండా పారదర్శకంగా పని చేయాలని చెప్పడమే ఈ జీరో బడ్జెట్ పాలిటిక్స్ ఉద్యమం.

### ప్రజలకు దూరమైతే..

అసెంబ్లీ నియోజకవర్గం ఒక చివర నుంచి మరో చివరకు 50 కిలోమీటర్లకు మించదు. నియోజకవర్గం పరిధిలో సుమారు వంద గ్రామాలుంటాయి. ఐదేళ్లలో నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ అన్ని గ్రామాల ప్రజలతో మమైకమేతే ఆ నాయకుడికి తర్వాతి ఎన్నికల్లో డబ్బు అస్సలు ప్రభావం చూపనే చూపదు. గ్రామాల్లో పర్యటిస్తే వాళ్ల అవసరాలు తెలుస్తాయి. అన్నీ ఒక్కసారే తీర్చలేకపోయినా దఫదఫాలుగా అయినా పనులు జరుగుతుంటాయి. దాంతో తమ ప్రతినిధిపై విశ్వాసం ఏర్పడుతుంది. ఈసారి గెలిపిస్తే మిగిలిన పనులు కూడా చేస్తారనే నమ్మకం కలుగుతుంది. ఆ నమ్మకమే ఎన్నికలకు పెట్టుబడి. అయితే చాలా సందర్భాల్లో డబ్బు లేని అభ్యర్థికి గెలుపు అందని ద్రాక్షగానే మిగులుతోంది. ఒక వ్యక్తి నిరాడంబరంగా చేతులు జోడించి ప్రజల ముందు నిలబడి నేను సేవ మాత్రమే చేయగలను, డబ్బు పంచలేను అని నిజాయితీగా చెప్పినప్పుడు ఆ వ్యక్తికి ఒక్క అవకాశం ఇవ్వవలసిన బాధ్యత మాత్రం సమాజానిదే.

### కులం ఒక అపోహ

ఏ కులానికైనా సరాసరిన ఐదు శాతం ఓటర్లు మాత్రమే ఉంటారు. ఒక పార్టీ నాయకుడి కులం ఐదు శాతం, స్థానిక అభ్యర్థి కులం ఐదు శాతం కలిసినా పది శాతమే. ప్రత్యర్థి పార్టీలోనూ అంతే. పది– పది ఇరవై శాతం పోగా మిగిలిన ఎనభై శాతం మంది ఓట్లు ఉంటాయి కదా! ఒకవేళ పార్టీ నాయకుడు, అభ్యర్థి ఒకే కులం వాళ్లయితే వాళ్లకు లభించే కుల మద్దతు ఐదు శాతమే. కాబట్టి కులం గెలిపిస్తుందనేది ఒక అపోహ మాత్రమే. గెలిపించేది మానవత్వం, నాయకత్వం మాత్రమే.

### రచ్చబండ వేదికగా..

ఎన్నికల ప్రచారం ఎంత ఆడంబరంగా ఉంటే అంతగా జనాన్ని ప్రభావితం చేయవచ్చనే అపోహలో ఉన్నారు నాయకులు. నిరాడంబరంగా ప్రజలతో మమేకమయ్యే వారికే నిజమైన ఆదరణ లభిస్తుంది. ఒక గ్రామానికి వెళ్లి రచ్చబండ మీద ఒక పూట గడిపితే, గ్రామస్తులు ఆ నాయకుడిని అక్కున చేర్చుకోకుండా ఉండగలుగుతారా? అంత సమయం కేటాయించే ఓపిక ఉండడం లేదెవ్వరికీ. భారీ హోర్డింగులు, మైకులతో గంట సేపట్లో ఊరంతటినీ చుట్టేసి కాలు కింద పెట్టకుండా ప్రచారం అయిందనిపిస్తున్నారు. జనం కూడా ‘నాయకులు వచ్చారు, వెళ్లారు’ అన్నట్లే అంటీ ముట్టనట్లు ఉంటున్నారు. వాళ్లటు వెళ్లగానే మర్చిపోతున్నారు.

### రేపటి తరాన్ని సిద్ధం చేయడం కోసం

ఆలోచన ఉంటే ఏదీ అసాధ్యంకాదు. భవిష్యత్తు తరం ఇప్పటి విద్యార్థులదే. వారిలో జీరో బడ్జెట్ పాలిటిక్స్ ఆలోచన రేకెత్తిస్తే వాళ్లే భవిష్యత్తు సమాజాన్ని ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యంతో పరిఢవిల్లేలా చేయగలుగుతారు. అందుకే విద్యాసంస్థలపై దృష్టి పెడుతున్నాను. కొత్తగా తెరమీదకొస్తున్న నాయకులు చిలుక పలుకుల్లా ‘జీరో బడ్జెట్ పాలిటిక్స్’ను తమ ప్రసంగాల్లో ప్రస్తావిస్తున్నారు. కానీ వాళ్లు కూడా ఆచరణలో పెట్టడం లేదని వాళ్ల చర్యలే చెబుతున్నాయి.

### బ్రిటన్ ఎంపీ.. బిహార్ ఎమ్మెల్యే

బ్రిటన్ పార్లమెంట్‌లో ఒక అనధికారిక సెషన్‌లో పాల్గొన్నప్పుడు అక్కడి ఎంపీ బారోనెస్ వర్మ ‘‘నేను ఇక్కడ (బ్రిటన్‌లో) ఎంపీని. అదే ఇండియాలో అయితే వార్డు మెంబర్‌ని కూడా కాలేకపోయేదాన్ని’’ అన్నారు. ఇండియా రాజకీయాల్లో డబ్బు ప్రభావం, వారసత్వ రాజకీయాలపై వాళ్లకు ఏర్పడిన అభిప్రాయం అది.



అరవై ఏళ్ల బారోనెస్ వర్మ, బ్రిటన్ పార్లమెంట్ (హౌస్ ఆఫ్ లార్డ్స్) మెంబర్. పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లో పుట్టారామె. బాల్యంలోనే తల్లిదండ్రులతో ఇంగ్లండ్ వెళ్లి అక్కడే స్థిరపడ్డారు.



సోమ్ ప్రకాశ్‌సింగ్

అయితే మనం ఇక్కడ మరో సంగతి కూడా గుర్తు చేసుకోవాలి. సోమ్ ప్రకాశ్‌సింగ్ బిహార్ రాష్ట్రం ఔరంగాబాద్ జిల్లా ఓబ్రా నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే. ఆయన ఇండిపెండెంట్‌గా గెలిచారు. ఎన్నికల ఖర్చుల కోసం ప్రజలు విరాళాలు పోగు చేసి రూ.1.,48 లక్షలు ఇచ్చారు. అందులో రూ.1.22 లక్షలు మాత్రమే ఖర్చయ్యాయి అతడికి. అలాగే తెలంగాణలో సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి రిటైర్డ్ టీచర్. గడచిన పంచాయతీ ఎన్నికల్లో నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం మల్లపురాజుపల్లి పంచాయతీ సర్పంచ్‌గా గెలిచారు. అతడికి కూడా గ్రామస్తులే లక్షా ఏడు వేల రూపాయల విరాళాలు సేకరించి పెట్టారు. అతడి ఎన్నికల ఖర్చు ఐదు వేలకు మించలేదు. మిగిలిన డబ్బు పంచాయతీకి జమ చేశారు. నిజాయతీగా ఉండే నాయకుడి వెంట జనం ఉంటారు. ఇలాంటి వాళ్లను గెలిపించడానికి పార్టీ అధిష్టానం నుంచి నాయకులు వచ్చి ప్రచారం చేయాల్సిన అవసరమే ఉండదు. వాళ్లను ప్రజలే గెలిపించుకుంటారు. అలా ప్రజల చేత గెలిపించుకోగలిగిన సత్తా ఉన్న నాయకులను తయారు చేయడమే జీరో బడ్జెట్ పాలిటిక్స్ ఉద్దేశం.

### వైఎస్‌ఆర్‌ని గుండెల్లో పెట్టుకున్నారు



పాలకుడు ప్రజలకు కల్పించాల్సిన మౌలిక వసతులు విద్య, వైద్యం, ఉపాధి, సాగునీరు, తాగునీరు, రోడ్డు, కరెంటు. వీటిని ఏర్పాటు చేస్తే ఆ నాయకుడిని సమాజం వదులుకోదు. గుండెల్లో పెట్టుకుంటుంది. మళ్లీ ఓట్ల కోసం వచ్చినప్పుడు ప్రజలు మనసారా స్వాగతిస్తారు. వైఎస్‌ఆర్ విజయవంతమైంది ఇక్కడే. మిగిలిన వాళ్లు ఎదురీదుతున్నది కూడా ఈ విషయంలోనే.

### ఇది మహావృక్షం

నేనెక్కడికి వెళ్లినా ‘ఈ ఫార్ములాని నిరూపించడానికి మీరే ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయవచ్చు కదా’ అని అడుగుతున్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే ఒక మహావృక్షానికి 2016లో బీజం వేశాను. మొలకెత్తి, ఎదిగి విస్తరించడానికి కనీసం ఒక దశాబ్దం పడుతుంది. మా జిల్లాలో తిమ్మమ్మ మర్రిమాను విస్తరించినట్లు జీరో బడ్జెట్ పాలిటిక్స్ అంశం కూడా ఊడలతో పరిపుష్టమవుతుంది. ఆ రోజున నేను, నాతోపాటు ఈ యజ్ఞంలో యూఎస్ నుంచి సహకరిస్తున్న శివారెడ్డి, జనార్దన్‌రెడ్డి, కోదాడ మోహన్, ఐబీటీ శివాజీ, బాలసుబ్రహ్మణ్యంతోపాటు అనేక మంది మిత్రులు కూడా క్రియాశీలక రాజకీయాల్లోకి వస్తారు. వేదికను పటిష్టంగా నిర్మించిన తర్వాత మాత్రమే ప్రదర్శన మొదలు పెట్టాలి.

**- పి. మాధవ్‌రెడ్డి, జీరో బడ్జెట్ పాలిటిక్స్ ఉద్యమకర్త**

### నమ్మకమే ఓటు విలువ

పోతిరెడ్డి మాధవ్‌రెడ్డిది అనంతపురం జిల్లా ఎలనూరు మండలం వాసాపురం గ్రామం. అమ్మానాన్నలు సుభద్రమ్మ, చినవీరారెడ్డి. వీరిది వ్యవసాయ కుటుంబం. చిన్న కమతంతో, ముగ్గురు అక్కలకు ఓ తమ్ముడు. బీఎస్ఎన్ఎల్‌లో ఉద్యోగం చేస్తున్నారు. భార్య లక్ష్మి, బాబు ప్రణవ్, పాప భవ్యశ్రీ.. ఇదీ ఆయన కుటుంబం. మూడేళ్ల వయసులో సోకిన పోలియోనే తన జీవితాన్ని మలుపు తిప్పిందంటారు మాధవరెడ్డి. ఫ్యాక్షన్ గ్రామంలో పుట్టిన తాను ఆ చట్రంలో ఇరుక్కోకుండా బయటకు రావడమే కాక సోదరుడి వరసయ్యే వ్యక్తికి ‘పగ ప్రతీకారాల కోసం జీవితాలను అంతం చేసుకోవద్ద’ని నచ్చచెప్పారు. ఇప్పుడు దేశంలోని రాజకీయ వ్యవస్థను ప్రక్షాళన చేయడానికి పూనుకున్నారు. జీరో బడ్జెట్ పాలిటిక్స్ ప్రచారంలో ఆయన ఇస్తున్న నినాదం ఇది..

*‘ఇప్పుడు కాకుంటే ఎప్పుడు...*
*మనం కాకుంటే ఎవరు?*
*చక్కదిద్దుదామా...*
*మనకెందుకని వదిలేద్దామా?’*

# ఆంధ్రల వున్నసొంటి యెలశ్చన్ల కామ్డి గీడేడుంది?

బాతాఖానీ

యెప్పట్లెక్కనె మాపటీలి మావూరి శెర్వు కాడి రాలెశెట్టు కింద పాత దోస్తులం జమైనం. యెంపి ఎలశ్చన్ల నామ్నేశన్లు ఐపోయ్నయ్ గద... ఇగ లీడర్ల లొల్లి షురువైతదని ఏన్గోపాల్సామి గుడికాడి సత్తన్న బాతాకాని మొదల్వెట్టిండు.

గివ్వేం ఎలశ్చన్లు బై... గింతనన్న మజా లేకపాయె. గవ్వే టికిట్ల లొల్లులు, ఒగల్నొగలు తిట్టుకొన్డు . పైసలిచ్చి జనాల్ను తీసుకపోవ్డు , మైకులల్ల ఊదరగొట్టుడు గంతెగద ... అన్మండ్ల కాడి అషోకు నారాజ్ ఐనట్టు మాట్లాడిండు.

యెలశ్చన్లంటె గివ్వి గాకుంట ఇంకే మంటయ్ తియ్. మీ నాయిన్న గుడ యేండ్లకేండ్లు సర్పంచిగ చేసిండు గద. మరి గిప్పుడె పాల్టిక్స్‌కు కొత్తగచ్చినోన్లెంక మాట్లాడవడ్తివి.. గొల్లదుబ్బల మీది రమ్నరావ్ కౌంటరిచ్చిండు.

అందర్ని ఓ సూపు జూశిన అషోక్... యెలశ్చన్లంటె ఎట్లుండాలె..? గింత సీర్యస్ గుంటయా? కాన్వాసింగుల కొంచెవన్న నవ్వులుండద్ద? గా అసంబ్లెలశ్చన్ల సీన్మ యాక్టరు బండుల గనేశు సీర్యస్ కామిడి తోటి నవ్విచ్చిండు. ఇగ మన ఈరో బాలయ్య ఆల్లన్న బిడ్డ కోసం కూకట్పల్లికచ్చి జేస్న కామ్డిని ఎవలన్న మర్శిపోతర? ఇగ ఐద్రాబాదును నేనే గట్టిన, సెల్ఫోన్లు నేనే దెచ్చిన అన్కుంట శెంద్రాలు సార్ గుడ గప్పట్ల కమ్మం, ఐద్రావాద్‌ల కామ్డి జేసి నవ్వుల పాలయ్యె.. అన్నడు.

గప్పుడె రాలె శెట్టు కాడికచ్చిన సర్పంచి రమేశు .. అరె ఏందె అషోకన్నా.. గిప్పుడు గాల్లను పిల్వియ్యి వంటవా ఏంది? గప్పుడు శెంద్రాలు అచ్చినందుకె కాంగ్రెసోల్ల బత్కు ఎట్లయిందో జూసినవ్ గద. అయిన గిసొంటి ఆలోశన్లు ఎందుకత్తన్నయ్ నీకు... నవ్వుకుంటనే అన్నడు.




ఆంద్ర యెలశ్చన్ల కామ్డి పీక్‌లకు వోయింది. పేస్బుక్కు, ఆట్సప్ లల్ల సూస్తలెవ్వ. తెలంగన సప్రేట్ అయినంక పేపర్లల్ల యే రాష్టం వార్తలాడ్నె పెట్టవట్టిరి. గందుకె గాడ యెన్ని జోకులు జర్గుతన్నా కన్పిత్తలెవ్వ. ఆంద్ర టీవీలల్ల యెప్పడన్నోసారి ఇత్తన్రు గని మనం గా టీవీల్నెందుకు సూత్తం. పేస్బుక్కు, ఆట్సప్పులల్ల సూశి కడ్పు వట్టుకొని నవ్వుడైతంది దెల్సా.. అన్నడు అషోకు.

నువ్వద్దే... నా పెద్ద కొడ్కు నిన్న సూపిచ్చిండు అని మొదల్వెట్టిండు మాజీ సర్పంచి లచ్చన్న ... సీన్మ యాక్టర్ పవనాలు ఆంద్రల కాన్వాసింగ్ శేసచ్చి... కారు డిక్కిల పండుకొని శేద తీర్తండని పేపర్ల పోట్వ యేసిన్రు. అరె... పవనాలు గుడ మనలెక్కనె ఉన్నడని మెచ్చుకుంట... పోట్వను దగ్గర్కి వట్టుకొని జూస్న.. డిక్కిల క్రుశ్నుని లెక్క ఓ శెయ్యి గద్వ కింద వెట్టుకొని కండ్లు మూస్కొని పండుకున్న పవనాల్... ఇంకో శేతిల ఛాయ గిలాస వట్టుకుండు. ఉడుకుడుకు ఛాయ తాక్కుంట, గద్వ కింద శెయ్యి వెట్టుకొని పండుకునుడేంది .. గా పోట్వను ‘శేద తీర్తన్న పవనం కల్యాను’ అని పేపర్లేసుడేంది. కామిడి అంటె... గదె గద అన్నడు.

నేన్గూడ జూస్న నిన్న ఓ టీవ్ల. తెల్లంగి, తెల్లలుంగి. రంగేశినట్టున్న నల్లగడ్డం తోటి నుల్క మంచెం మీద గూసొని ఆకాశెంలకు సూస్కుంట ఇంటర్వ్యు ఇత్తండె. టీవ్ల ఇంటర్వ్యు ఇచ్చెటోడు కెమ్రను సూడర..? గట్లనె ఇవ్వల్ల శెట్టు కింద కూసొని మట్టి ముకుట్ల సల్లతోటి జొన్న గడ్క తింటండని ఓ పోట్వచ్చింది. రోజ్కో కొత్త పోజులిచ్చు కుంట పవనాలు మస్తు నవ్విత్తండు... అన్నడు కోటర్స్‌లుండె లచ్చన్న

శేత్లె వున్న ష్మార్ట్ ఫోన్ను తీసి ఆట్సప్పుల అచ్చిన జోకుల్ని జూస్కుంట ఒకటే నవ్వవట్టిండు శెర్వు కాడి శీనన్న. జెప్పి నవ్వరాదె అనెసర్కి... మన ‘మందల గిలి లోకేశెం’ నిన్న మాట్లాడుకుంట... మచ్లిపట్నం పోర్టును తెలంగానకు తీస్కపోవడాన్కి కేసియారు మస్తు కష్టపడుతండని శెప్పిండు. ఇగ మొకానికి చెయ్యండం బెట్టుకొని శెల్ఫి తీస్కునుడు. ఎవ్వల పన్న ఆల్లుంటె ఈనె ఒక్కడె శెల్ఫి దీస్కునుడు... నవ్వాపుకోలేక సత్తనాం ... కొంచెవన్న కామ్డినా...

ఈల్లకు కే యెపాల్ గుడ జమైండు అని యూత్లీడర్ రాజుగాడు ముచ్చట స్టాట్ జేసిండు. కే యెపాలు అమ్రిక అద్యెక్శుడు ట్రంపు, ఇంకో రొండు మూడ్వందల దేశాల పెసిడెంట్లతోనె మాట్లాడ్తడు. ఆంద్ర రాశ్టంల గాయిన వెట్టిన పెజాశాంతి పార్టి గెలుస్తదంట. నామ్నేశన్ సుతం ఏసిండు. ఆస్తిపాస్తులు, కేస్లు, బాంకు అకౌంట్ల ఇవరాలు ఇయ్యకుంటనె నామ్నేశన్ ఏసిండట. అవన్ని అమ్రికాల్నె వుంటె... గిక్కడోల్లకెందుకు అన్కున్నడేమొ... ఈనె జర్నలిస్టుల్ని గుడ ఆల్ల పార్టికెల్లి పోటి జేసి గెలువుమని జెప్పిండు. గాయినె పైసల్ వెట్టుకుంటడంట. గిసొంటి కామ్డి మనకద్దా అన్నా... అన్నడు రాజు గాడు.

మల్ల అన్మండ్ల కాడి అషోకు అందుకున్నడు ... తెలంగాన అచ్చినంక మనకు కామిడి లేకుంటపోయింది. ఈడికచ్చన్న గిసొంటి మాటల్జెప్తురనుకుంటె గాడ గుడ యెలశ్చన్లు జరుగవట్టె.. ఈడనేమొ 15 రోజ్లు సప్పటి ప్రశారమె ఉంటదనిపిస్తంది. గీ లీడర్ల కామ్డి ఆట్సప్పులల్ల సూసుడు కన్న డైరెట్టుగనె మంచిగుంటది. లాస్టుకు పేపర్లనన్న ఆంధ్ర ఎలశ్చన్ల కామిడికి ... ప్శెషల్ పేజి పెట్టువని జెప్పాలె. ఓ పేపర్ల పవనాలు పోట్వలేస్కుంట నవ్విత్తన్న గని... ఇంక కామిడి ఉండెటట్టు ఏవన్న జెయ్యిమని గా పేపర్కి లెటర్లు రాద్దాం. టీవ్లోల్లు గుడ ప్శెషల్ బుల్టెన్లు యేసి శెంద్రాలు, పవానాలు, లోకేశెం, కేయెపాలు కామిడీ శోలు ఏపిస్తె తెలంగాన్ల మస్తు టీయార్పి వస్తది...

శీకటి వడ్తంటె ఇగ అందరం ఇండ్లకు పోయెడాన్కి లేశినం. రేప ఆట్సప్పులు, టీవీల్ల శెంద్రాలు, పవనాలు , లోకేశం, కేయెపాలుల కామ్డి ఏవుంటదో అన్కుంట..

**..:::: పోలంపల్లి ఆంజనేయులు,**
**సాక్షి ప్రతినిధి, కరీంనగర్**

# అరవై ఏడేళ్లలో ఆరున్నరేళ్లే..





సామాజిక వర్గాలు, మెజారిటీ జనాభాతో సంబంధం లేకుండా నాయకత్వ విలువలకే ప్రాధాన్యతనిచ్చి అందలం ఎక్కించే పరిణతి కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం సొంతం. వ్యవసాయ ప్రాధాన్యత గల ఈ నియోజకవర్గంలో వెనుకబడిన వర్గాల ప్రజలే పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఉన్నత సామాజిక వర్గాలకు చెందిన కుటుంబాలు గ్రామాల్లో తక్కువగానే ఉన్నా.. స్వాతంత్ర్యం పూర్వం నుంచే వారిలో రాజకీయ చైతన్యం ఎక్కువ. అదే ఒరవడి స్వాతంత్ర్యం వచ్చాక కూడా కొనసాగింది. 1952 నుంచి జరుగుతున్న పార్లమెంటు ఎన్నికల్లో కరీంనగర్ నుంచి కేవలం రెండుసార్లు మాత్రమే బీసీ వర్గాలకు చెందిన నేతలు ఎన్నికవడం గమనార్హం. వారు కూడా కేవలం ఆరున్నరేళ్లే ప్రాతినిధ్యం వహించారు. 1952లో ఈ నియోజకవర్గం ఏర్పాటు కాగా, ఆ సంవత్సరంతో పాటు 1957లో ఇద్దరు సభ్యులు ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించారు. ద్విసభ్య నియోజకవర్గంగా రెండుసార్లు కొనసాగినప్పుడు కూడా రిజర్వు చేసిన స్థానంలో ఎస్సీలు గెలుపొందితే, మరో స్థానంలో ఉన్నత సామాజిక వర్గానికి చెందిన నేతలే ఎంపీగా గెలిచారు. ఆ తరువాత 1962 నుంచి వరుసగా జె.రమాపతిరావు, ఎం.సత్యనారాయణరావు, జువ్వాది చొక్కారావు 1991 వరకు ఎన్నికవుతూ వచ్చారు. వీరంతా ఉన్నత సామాజిక వర్గానికి చెందిన వారే. 1996లో తొలిసారిగా తెలుగుదేశం నుంచి పోటీ చేసిన బీసీ వర్గానికి చెందిన ఎల్.రమణ కాంగ్రెస్ కురువృద్ధుడు జువ్వాది చొక్కారావుపై అనూహ్య విజయం సాధించారు. అయితే బీసీ నేతగా ఎన్నికైనప్పటికీ, 1996లో ఏర్పాటైన యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఏడాదిన్నరకే రద్దవడంతో 1998లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసిన చెన్నమనేని విద్యాసాగర్‌రావు విజయం సాధించారు. 1999లో మరోసారి విద్యాసాగర్‌రావు గెలవగా, 2004లో టీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖరరావు గెలుపొందారు. 2006, 2009 ఉప ఎన్నికల్లో కూడా కేసీఆర్ జయకేతనం ఎగరేశారు. కానీ 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన పొన్నం ప్రభాకర్ టీఆర్‌ఎస్ అభ్యర్థి బి.వినోద్ కుమార్‌పై విజయం సాధించి, ఇక్కడి నుంచి గెలిచిన రెండో బీసీ నేతగా రికార్డుల్లోకి ఎక్కారు. 2014లో మళ్లీ ఉన్నత సామాజిక వర్గానికి చెందిన బి.వినోద్‌కుమార్ గెలిచారు. ఈసారి వినోద్‌కుమార్ (టీఆర్‌ఎస్), పొన్నం ప్రభాకర్ (కాంగ్రెస్) ఇక్కడి నుంచి పోటీ పడుతున్నారు.

**- సాక్షి ప్రతినిధి, కరీంనగర్**



### ఓటేద్దాం.. ఫొటో దిగుదాం!




‘ఓటు వేయండి.. వచ్చి సెల్ఫీ దిగండి..’ అంటూ యూత్‌ను ఆకట్టుకునేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్నికల అధికారులు సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు. ‘నా ఓటు.. నా హక్కు’ అని చాటుకునేందుకు ఈ సెల్ఫీ పాయింట్ ఉపయోగపడుతుందని, యువతలో అవగాహన పెరుగుతుందనీ అంటున్నారు.

**- దశరథ్ రజువా, భద్రాద్రి కొత్తగూడెం**